ఆహార భద్రత.. ఆవశ్యకత

అంతర్జాతీయ ఆహార విధాన పరిశోధన సంస్థ (ఇంటర్నేషనల్ ఫుడ్ పాలసీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) విడుదల చేసిన అంతర్జాతీయ ఆకలి సూచికలో భారతదేశం 67వ స్థానంలో ఉంది. ఇది చైనా, శ్రీలంక దేశాల కంటే చాలా కింద స్థానం. ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) అంచనాల ప్రకారం, ప్రపంచంలో పౌష్టికాహార లోపంతో బాధ పడే ప్రజల్లో 25 శాతం మంది భారతీయులే. భారత ప్రభుత్వం పార్లమెంటులో త్వరలో ప్రవేశపెట్టనున్న ఆహార భద్రత బిల్లు దీనికి పరిష్కార మార్గం సూచించడానికి ఉద్దేశించినదే. అంతర్జాతీయ ఆహార విధాన పరిశోధన సంస్థ గణాంకాల ప్రకారం మన దేశంలో 22 శాతం ప్రజలు పౌష్టికాహార లేమితో బాధపడుతున్నారు. అయిదు సంవత్సరాల్లోపు పిల్లల్లో 43.5 శాతం మంది తక్కువ బరువు కలిగున్నారు. దాదాపు 7 శాతం మంది పిల్లలు అయిదేళ్ల వయసు దాటక ముందే మరణిస్తున్నారు.

ఈ వాస్తవాలను దృష్టిలో పెట్టుకుని భారత ప్రభుత్వం ఆహార భద్రతను ఒక హక్కుగా గుర్తించి అమలు చేయాలి. ఆహార భద్రత భావనను వివరించడం అవసరం. 1996లో జరిగిన ప్రపంచ ఆహార శిఖరాగ్ర సమావేశం ఆహార భద్రతను ఈ విధంగా నిర్వచించింది: ప్రజలందరూ, ఎల్లప్పుడూ చాలినంత, సురక్షితమైన పౌష్టికాహారాన్ని పొందగలిగి ఆరోగ్యవంతమైన, చురుకైన జీవనాన్ని కొనసాగించగలగడం. ''భౌతికంగా, ఆర్థికంగా ఆహార వనరులు అందుబాటులో ఉండటంతోపాటు, ప్రజల ఆహార అవసరాలు తీరడం, వారికి ఇష్టమైన ఆహారం లభించడం'' ఆహార భద్రత అని చెప్పవచ్చు.

ఆహార భద్రత ప్రధానంగా మూడు అంశాల చుట్టూ పరిభ్రమిస్తుంది. అవి:

- ఎలాంటి అవరోధాలు లేకుండా నిరంతరం చాలినంత ఆహారం లభ్యం కావడం
- ఈ ఆహారాన్ని వినియోగించుకోవడానికి తగిన వనరులు ఉండటం
- ప్రాథమిక పౌష్టికాహార వినియోగంపై తగిన అవగాహన, చాలినంత నీరు, పారిశుద్ధ్య సౌకర్యాల లభ్యత.

ఆహార భద్రత... ఆరోగ్యం, ఆర్థిక ప్రగతి, పర్యావరణం, వాణిజ్యం తదితర అంశాలతో ముడిపడి ఉంది. దీనికి సంబంధించి తరచుగా ఈ వాదనలు వినపడుతుంటాయి. అవి–

- ప్రపంచంలో ప్రజలందరికీ సరిపడేంత ఆహారం ఉంది. దానిని అందరికీ పంచడమే ప్రధాన సమస్య.
- భవిష్యత్ ఆహార అవసరాలను ప్రస్తుత స్థాయిలో జరుగుతున్న ఉత్పత్తి తీర్చగలదా?
- జాతీయ ఆహార భద్రత అత్యంత ముఖ్యమైన అంశం. లేదా వాణిజ్యాన్ని ప్రపంచీకరణ చేస్తున్న నేపథ్యంలో ఆహార భద్రతకు అంతగా ప్రాధాన్యం ఇవ్వనవసరం లేదు.



- ప్రపంచీకరణ గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఆహార లోటును, పేదరికాన్ని ఎంత వరకు పరిష్కరించగలదు?
- అన్ని కుటుంబాలకు సరిపడేంత ఆహారం లభిస్తుందా, ఒక వేళ లభించినా కుటుంబంలోని సభ్యులందరికీ వారి అవసరాలకు అనుగుణంగా దొరుకుతుందా అనే అంశాలు ఆహార భద్రతను ఆరోగ్యంతో ముడిపెడుతున్నాయి.

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈనాటికీ వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. అంతర్జాతీయ ఆహార ఒడంబడికలు ఆ దేశపు ఆహార భద్రతకు కీలకం. విమర్శకుల అభిప్రాయంలో.. వాణిజ్య సరళీకృత విధానాలు ఒక దేశ వ్యవసాయాధార ఉద్యోగావకాశాలు తగ్గించడం ద్వారా ఆహార భద్రతకు హాని కలిగిస్తున్నాయి అనే వాదన ఉంది. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) ఒప్పందాలు వర్ధమాన దేశాల ఆహార భద్రతకు తూట్లుపొడుస్తున్నాయనే విమర్శ కూడా ఉంది.

ప్రపంచంలో ఆకలితో అలమటించే ప్రజల్లో ఎక్కువమంది భారతీయులే. సహారా దిగువన ఉన్న 25 ఆఫ్రికా దేశాల కంటే భారత్‌లో ఆకలి బాధకు గురవుతున్న వారే ఎక్కువ మంది ఉన్నారు. మన దేశంలో ప్రజా పంపిణీ వ్యవస్థ (పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్) ద్వారా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న 65 మిలియన్ల కుటుంబాలకు, దారిద్ర్య రేఖకు ఎగువున ఉన్న 115 మిలియన్ల కుటుంబాలకు సబ్సిడీ రేట్లకు ఆహార ధాన్యాలు సరఫరా అవుతున్నప్పటికీ ప్రపంచ ఆకలి సూచికలో భారత దేశం అతి తక్కువ స్థాయిలో ఉంది. అధికార గణాంకాల ప్రకారం 900 మిలియన్ల ప్రజలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ఆపన్న హస్తం అందిస్తున్నప్పటికీ ప్రపంచంలో ఎక్కువ మంది పేద ప్రజలు భారతీయులు కావడం అంతు చిక్కని సమస్య. దారిద్ర్య నిర్మూలనలో ముందు వరుసలో ఉన్న పంజాబ్, కేరళ లాంటి రాష్ట్రాలు కూడా గాబన్, హండోరాస్, వియత్నాం లాంటి దేశాల కంటే (ఆహార భద్రత విషయంలో) దిగువ స్థాయిలో ఉన్నాయి. జాతీయ సలహా మండలి ప్రతిపాదించినట్లు ప్రజా పంపిణీ వ్యవస్థను బాగా వెనుకబడిన 150 జిల్లాల్లో అందరికీ (యూనివర్సల్) వర్తింపచేసినప్పటికి ఆకలి చావులను అరికట్టడంలో, పౌష్టికాహార లోపాన్ని తగ్గించడంలో సఫలీకృత మౌతుందనుకోవడం భ్రమే.

జాతీయ గ్రామీణ ఉపాధి పథకం (ఎన్ఆర్ఈజీ) పేద ప్రజలకు ఉపాధి అవకాశాలు లేని రోజుల్లో ఉపాధి కల్పించాలని ఉద్దేశించింది. దీని ప్రభావం పేద ప్రజల ఆర్థిక పరిస్థితి మీద అంతంత మాత్రమే. కుటుంబానికి ఒక సభ్యుడు చొప్పున గరిష్టంగా లభించే 100 రోజుల ఉపాధి పథకం కంటే.. ఒక కుటుంబంలోని సభ్యులంతా ఇటుక బట్టీలలో పనిచేయడానికి ఎంతో మంది పేద ప్రజలు ముందుకు వస్తున్నారంటే జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ఏ మేరకు విఫలమైందో అర్థం చేసుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో ఇటుక బట్టీల్లో సంవత్సరానికి 180-200 రోజులు పని లభ్యమవుతుంది. కుటుంబంలో ఎంత మంది సభ్యులైనా పనిచేయవచ్చు. దినసరి కూలీ ఎలాంటి ఢోకా లేకుండా లభిస్తుంది.

మరోవైపు మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకాన్ని ఎప్పుడు, ఎంత కాలం, ఎంత మందికి వర్తింపచేస్తారో తెలియదు. అమలు చేసినా పూర్తి వేతనాలు ఇస్తారనే నమ్మకం, అవి సకాలంలో అందుతాయనే గ్యారంటీ లేదు. స్థానిక ప్రజా ప్రతినిధులకు, ప్రభుత్వ ఉద్యోగులకు, కాంట్రాక్టర్లకు ఇది ఉపాధి పథకమే గాని పేద ప్రజలకు కాదు. ఆ పంథాలోనే ప్రతిపాదిత ఆహార భద్రత కార్యక్రమం అమలు కాబోతున్నది. జాతీయ సలహా మండలి సూచనల ప్రకారం 150 జిల్లాల్లో ప్రతి కుటుంబానికి నెలకు 35 కిలోల గోధుమలు/బియ్యం కిలో మూడు రూపాయల ధరకు లభ్యమవుతాయి.

అంత్యోదయ పథకం పరిధిలోకి వచ్చే పేద ప్రజలకు గోధుమలు కిలో రెండు రూపాయలకు లభ్యమౌతాయి. అయితే ఇందులో పప్పు దినుసులు, నూనెలు సబ్సిడీ ధరలకు లభించవు. పైగా ఎక్కువ సభ్యులున్న కుటుంబాలకు 35 కిలోలు సరిపోవు. ప్రతిపాదిత కార్యక్రమం ప్రస్తుతం అమలులో ఉన్న పథకం కంటే మెరుగైనది. అయితే దీనిని దేశమంతటా అందరికీ వర్తింపచేయాలి. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో అవసరమున్న పౌరులెవరైనా ప్రజా పంపిణీ వ్యవస్థ కింద చౌక ధరలకు నిత్యావసర వస్తువులు (గోధుమలు/బియ్యం, పప్పులు, కిరోసిన్) కొనుగోలు చేయవచ్చు. రాజ్యాంగంలోని ఆదేశ సూత్రాలు ప్రజలందరికీ ఆహారం, వైద్య సదుపాయాలు, విద్య, గౌరవప్రదమైన ఉపాధి కల్పించాలని నిర్దేశిస్తున్నాయి. ఇవి పౌరుల హక్కు. వాటి అమలులో ఎలాంటి వివక్ష ఉండకూడదు.

ప్రజా పంపిణీ వ్యవస్థతోపాటు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, మధ్యాహ్న భోజన పథకం, సమగ్ర శిశు సంక్షేమ పథకం, అంత్యోదయ అన్న యోజన (ఏఏవై) పథకం మొదలైనవి ఆహార భద్రతను పటిష్టం చేస్తాయి. ఆహార ధాన్యాల ఉత్పత్తిని పెంచడానికి జాతీయ ఆహార భద్రతా మిషన్ 467 జిల్లాల్లో పనిచేస్తోంది. ప్రతిపాదిత ఆహార భద్రత బిల్లు కొన్ని అభ్యుదయ అంశాలను చేర్చింది. అవి..

- అనాధలకు, రోగ పీడితులకు, ప్రకృతి వైపరీత్యాలకు గురైన పేద ప్రజలకు ఉచితంగా ఆరోగ్యకరమైన భోజనాన్ని అందించడం,
- ప్రజాపంపిణీ వ్యవస్థలో పారదర్శకతను పెంపొందించడం,
- సమాచార సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పంపిణీ ప్రవృత్తిలోని లొసుగులను తొలగించడం,
- జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ఆహార, పౌష్టిక కమిషన్లను ఏర్పాటు చేయడం,
- జిల్లా స్థాయిలో క్లేశ నివారణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం

ఇవి హర్షించదగిన సూచనలు. అయితే వీటిని అమలు చేయడం వల్ల ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతుందని రంగరాజన్ కమిటీ అభిప్రాయం వెలిబుచ్చింది.

ఇటీవల కాలంలో ప్రభుత్వం వ్యవసాయ రంగానికి తగిన ప్రోత్సాహాన్ని ఇవ్వకపోవడంతో డిమాండ్‌కు తగినంతగా ఆహార ధాన్యాల ఉత్పత్తి నమోదు కావట్లేదు. 1990-2007 కాలంలో జనాభా పెరుగుదల సంవత్సరానికి 1.9 శాతమైతే, ఆహార ధాన్యాల ఉత్పత్తి 1.2 శాతం మాత్రమే. లోటును భర్తీ చేయడానికి తాత్కాలికంగా ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకోవచ్చు. అయితే అది తాత్కాలిక ఉపశమనమే. వ్యవసాయ రంగానికి తగిన ప్రోత్సాహం లభించినప్పుడు స్వయం సమృద్ధిని సాధించడంతోపాటు, వ్యవసాయాధార ఉపాధి అవకాశాలు పెరిగి ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. అదే నిజమైన భద్రత. తృణ ధాన్యాల వినియోగం నానాటికీ క్షీణిస్తోంది. ఎక్కువ శక్తినిచ్చేవి, పోషకాంశాలు కలిగినవి తృణ ధాన్యాలే. తృణ ధాన్యాల వినియోగం తలసరి 170 కిలోల నుంచి 150 కిలోలకు, పప్పు దినుసుల వినియోగం 15 కిలోల నుంచి 12 కిలోలకు తగ్గింది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం రక్త హీనతతో బాధపడే మహిళల శాతం గ్రామీణ ప్రాంతంలో 54 నుంచి 58 శాతానికి, పట్టణ ప్రాంతంలో 46 నుంచి 52 శాతానికి పెరిగింది. గ్రామీణ ప్రాంత శిశువుల్లో రక్త హీనత 75 నుంచి 81 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 71 నుంచి 73 శాతానికి పెరిగింది. అంటే దేశంలో 70-80 శాతం ప్రజలు దుర్భలులే. ఈ గణాంకాలు మన దేశ ప్రజల అభద్రతకు సూచికలు.

విధానపరమైన సూచనలు

- ప్రజా పంపిణీ వ్యవస్థను మెరుగు పరచడంతోపాటు, ఆహార కూపన్లు వంటి ప్రత్యామ్నాయాలను అధ్యయనం చేయాలి.
- సాగుబడి విస్తీర్ణం క్రమేణా తగ్గుతున్న నేపథ్యంలో సమగ్ర జాతీయ విధానాన్ని రూపొందించాలి. వ్యవసాయ భూమిని ఎట్టి పరిస్థితుల్లో వ్యవసాయేతర కార్యకలాపాలకు ఉపయోగించకూడదు.
- వ్యవసాయ రంగానికి అదనపు పెట్టుబడులతోపాటు పరిశోధన, మౌలిక సదుపాయాల కల్పన, నీటిపారుదల, నిర్వహణ, మార్కెటింగ్ సదుపాయాలు, ఆహార ధాన్యాల నిల్వకు సరిపడ గిడ్డంగులు, కూరగాయలు, పండ్ల నిల్వకు శీతల గిడ్డంగులను ఏర్పాటు చేయాలి.
- వ్యవసాయదారులకు, వినియోగదారులకు లబ్ధి కలిగించడానికి

దళారుల ప్రమేయం తొలగించాలి. ఉత్పత్తి దారుడు ప్రత్యక్షంగా వినియోగదారునితో సంబంధం కలిగి ఉంటే ఇరు పక్షాలకు మేలు.

- భూగర్భ నీటి నిల్వను పెంచడానికి, వర్షపు నీటిని నిల్వ చేయడానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. భారత దేశంలో 3/5 వంతు సాగు వర్షాధారమే. రైతులకు సబ్సిడీలు ఇవ్వడం ద్వారా భూగర్భ జలాల పరిరక్షణను ప్రోత్సహించాలి.
- వ్యవసాయదారునికి గిట్టుబాటు ధర లభించేలా హేతుబద్ధ చర్యలు తీసుకోవాలి. అనేక సందర్భాల్లో ప్రభుత్వ నిర్ణయాలు అనాలోచితంగా, ఆలస్యంగా ఉంటాయి.
- దురదృష్టవశాత్తు వ్యవసాయోత్పత్తులు వాటి ధరలు బడా వ్యవసాయ వాణిజ్య సంస్థల ప్రభావానికి లోనవుతున్నాయి. ఆయా సంస్థలు కృత్రిమ కొరతను సృష్టించి ధరలు పెంచేస్తున్నాయి. వీటిపై ప్రభుత్వం చిత్తశుద్ధితో సకాలంలో తగిన నివారణ చర్యలు తీసుకోవాలి.
- ప్రజల వినియోగానికి సరిపడినంత ఆహార ధాన్యాలున్నప్పుడే విదేశాలకు ఎగుమతులను అనుమతించాలి. అంతర్జాతీయ, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు ఆహార భద్రతకు భంగం కలిగించే విధంగా ఉండకూడదు.